విద్యకు ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- కేజీబీవీ జూనియర్ కళాశాల భవనాలు ప్రారంభం



కేజీబీవీ జూనియర్ కళాశాల నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు విద్యార్థులంతా ఉన్నత విద్యావంతులై మరింత మందికి విద్యను అందిచాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని సబ్బవరం కేజీబీవీలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు రూ.కోటి సర్వశిక్ష నిధులతో కళాశాల నూతన భవనాలు నిర్మించినట్టు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేద, మధ్య తరగతి విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్యను చేరువ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా వసతులు కలిప్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మెరుగైన విద్యా బోధన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేజీబీవీలో తరగతి గదులు,తాగునీరు,క్రీడా మైదానం వంటి వసతులపై ఆరా తీశారు. త్వరలోనే కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ ఎంపీపీలు సబ్బవరపు ముత్యాలనాయుడు, గొర్లి ఉమా మహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, కేజీబీవీ ఎస్‌వో మృదుల, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,వనం అచ్చెంనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ మహిళా ప్రతినిధులు బంతికోళ్ల పద్మ,దెడ్డం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముత్యాలరావుకు ఎమ్మెల్యే పరామర్శ



బొట్ట ముత్యాలరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: కుమార్తెను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న వైఎస్సార్‌సీపీ 88వ వార్డు యూత్ అధ్యక్షుడు బొట్ట ముత్యాలరావు కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. వెదుళ్లనరవలోని బొట్ట ముత్యాలరావును స్వగృహం వద్ద ఆయన్ను ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంజులశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గర్రెడ్డి మహలక్ష్మినాయుడు, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం



జూనియర్ కళాశాలలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న మోహన్‌రావు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శ్రీ భార్గవి ఆమోనియా అండ్ కెమికల్స్ సంస్థ సమకూర్చిన ఆర్వో ప్లాంట్‌ను పరవాడ ఇండస్ట్రీస్ సర్వీస్ సొసైటీ అసోసియేషన్ చైర్మన్ గుత్తికొండ మోహన్‌రావు గురువారం ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జి.వి. నారాయణరావు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో లాలం కోడూరు ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ నాయుడు, విశ్రాంత ఫిజిక్స్ అధ్యాపకుడు శ్రీరంగనాయకులు, పరవాడ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందఅప్పారావు, ప్రతినిధులు కిశోర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



85వ వార్డు గంగిరెడ్ల కాలనీలో పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు గంగిరెడ్ల కాలనీ, ఎస్సీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు, సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడం కోసం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు సుందరపు అప్పారావు, కింతాడ ఈశ్వరరావు, దాసరి ప్రకాష్, కర్రి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

'అగనంపూడి టోల్‌గేటు తరలించాలి'

అగనంపూడి: అనకాపల్లి–సబ్బవరం మధ్య టోల్‌గేటు ఏర్పాటు చేసిన తర్వాత కూడా అగనంపూడి టోల్‌గేటు కొనసాగించడం అన్యాయమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ అన్నారు. వెంటనే టోల్‌గేట్‌ను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల కిందట హైకోర్టు ఆదేశాల మేరకు టోల్ ఫీజు ఉపసంహరించుకున్నారని, తరువాత హైవే అధికారులు, కాంట్రాక్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించే సమయంలో అనకాపల్లి వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేసిన తర్వాత అగనంపూడి టోల్‌ప్లాజాను మూసివేస్తామని న్యాయస్థానానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల కిందట రహదారి విస్తరించే సమయంలో రుణంగా తీసుకున్న మొత్తం తిరిగి రాబట్టిన తర్వాత కూడా అడ్డగోలుగా దోపిడీ చేయడం తగదన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రోగులకు చిత్తశుద్ధితో సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. పెందుర్తి మండల పరిధిలోని సరిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్, కుటుంబ డాక్టర్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ వైద్యులు,ఇతర ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గర్భిణులు,వ్యాధి నిరోధక టీకాలకు వచ్చే వారి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా సరిపల్లి హెల్త్ క్లినిక్‌ను సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు.

ఉపాధి కూలీల ధర్నా



వాడచీపురుపల్లిలో చెరువు వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వాడచీపురుపల్లి చెరువు వద్ద కూలీలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఆరు వారాల నుంచి వేతనాలు చెల్లించక పోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు తగ్గించి పేద ప్రజల పొట్ట కొట్టాలని చూస్తుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కూలీలంతా ఐక్యంగా పోరాటం సాగించాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్వతి, వరహాలమ్మ, మౌనిక, వరలక్ష్మి, రమణమ్మ, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో పర్యావరణానికి మేలు


జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ



ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

అల్లిపురం : అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ సెంటర్లు (ట్రిపుల్ ఆర్) ఎంతో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. గురువారం ఆయన ఎండాడ, తగరపువలస, గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో గల ట్రిపుల్ ఆర్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ సెంటర్ల ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు, వ్యర్థాల నిర్వహణకు, స్థిరమైన అభివృద్ధికి ఈ కేంద్రాలు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాల్లో అనేక రకాల గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలను ట్రిపుల్ ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి రీసైక్లింగ్ చేసి ఆట వస్తువులతోపాటు ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్నారు. అనంతరం తగరపువలస, సబ్బివానిపాలెంలోని బుక్ కేఫిని సందర్శించి పౌరులకు మంచి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయనతోపాటు జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు శ్యాంసన్ రాజు, సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో కిషోర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా జాగృతి సొసైటీ మహాజన సభ



జాగృతి పరస్పర సహకార సంస్థ వార్షిక నివేదిక ఆవిష్కరిస్తున్న అతిథులు, సొసైటీ సభ్యులు

సబ్బవరం: మహిళలకు పొదుపు కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు అన్నారు. సబ్బవరంలోని జాగృతి కాంప్లెక్స్ ఆవరణలో గురువారం జాగృతి పరస్పర సహాయ పొదుపు సంఘం 28వ మహాజన సభ నిర్వహించారు. సొసైటీ ఎండీ కందర్ప సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సొసైటీ అధ్యక్షుడు కోట్ని అమ్మతల్లినాయుడు దీనికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్యాలనాయుడు మాట్లాడుతూ మహిళలు పొదుపుతో పాటు సమకాలీన అంశాలపై జాగురకతతో వ్యవహరిస్తూ మరింత మందికి భరోసా కల్పించాలన్నారు. విజయ నిర్మాణ్ కంపెనీ చైర్మన్ ఎస్. విజయ కుమార్ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. సొసైటీ ఎండీ సుజాత వార్షిక నివేదికన వివరించారు. సొసైటీ రూ.30.33 కోట్ల టర్నోవర్‌తో విశాఖ,అనకాపల్లి జిల్లాల్లోని 148 గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. సొసైటీలో 278 కేంద్రాలతో 22 వేల మంది సభ్యులతో ప్రస్తుతం విజయవంతంగా నడుస్తోందని చెప్పారు. ఈ ఏడాది రూ.17.25 లక్షల నికర లాభం సాధించిందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్ల టర్నోవర్‌కు చేరుకోవడంతో పాటు 30 వేల మంది సభ్యత్వం సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడిగా కోట్ని అమ్మతల్లినాయుడు, ఉపాధ్యక్షురాలిగా గుర్రం అప్పలనర్సమ్మ, మేనేజింగ్ డైరెక్టర్‌గా కందర్ప సుజాత ఎన్నికయ్యారు. సమావేశంలో సీఈవో మౌక్తిక, కన్సల్టెంట్ వీవీ సుబ్రహ్మణ్యం,జాగృతి సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో గణాంకాలు కీలకం

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గణాంకశాస్త్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణాంకాల (స్టాటిస్టిక్స్) ప్రాముఖ్యతను కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు వివరించారు. దేశాభివృద్ధిలో గణాంకాలు ముఖ్యభూమికను వహిస్తా యని తెలిపారు. స్టాటిస్టిక్స్ విభాగాధిపతి షేక్ కౌసర్ మాట్లాడుతూ నిత్యజీవితంలో గణాంకా ల అప్లికేషన్‌లు ఏ విధంగా ఉపయోగపడతా యో వివరించారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగాధిపతి రామ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం శయన ఏకాదశి పూజలు(తొలి ఏకాదశి) పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామికి ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

గిరిప్రదక్షిణలో బాలలకు సౌకర్యాలు కల్పించండి



సింహగిరిపై సమీక్ష నిర్వహిస్తున్న సీతారామ్ తదితరులు

సింహాచలం: గిరిప్రదక్షిణతో పాటు ఆలయ ప్రదక్షిణ సమయంలో బాలలకు అన్ని సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్, కుమారి ఆదిలక్ష్మి సింహాచలం దేవస్థానం అధికారులకు సూచించారు. సింహగిరిపై గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సారథ్యంలో దేవస్థానం అధికారులు, స్త్రీ,శిశు సంక్షేమశాఖ, కార్మిక శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, 1098 చైల్డ్‌లైన్, వార్డు సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీతారాం, ఆదిలక్ష్మి వచ్చే నెల 2న జరగనున్న గిరిప్రదక్షిణకు సంబంధించి దేవస్థానం అధికారులు చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. దారి పొడువునా పిల్లలకు వేడి పాలు, బిస్కెట్లు అందించాలే క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీసీ సుజాత, సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు జంగం శ్రీనివాస్, భ్రమరాంబ, రమేష్ బాబు, నరసింహరాజు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌డైరెక్టర్ డి.వెంకటేశ్వరి, కార్మికశాఖాధికారి ఎస్.విజయశ్రీ, సీడీపీవోలు ఎం.వి.రమణకుమార్తి, డి.నీలవేణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

సింహాచలం: పెందుర్తి మండలం చినముషిడివాడలోని మసీదు–ఎ–నూరానిలో ఫౌండర్ ప్రెసిడెంట్ షేక్ మౌలా ఆధ్వర్యంలో గురువారం బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మసీదు అధ్యక్షుడు షేక్ బ్యుహన్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. షేక్ బాబూలాల్, షేక్ గౌస్ మెయినుద్దీన్, షేక్ ఇస్మాయిల్, షేక్ జాఫర్, సిలార్, షేక్ దర్గా, షేక్ వలియా, అబ్దుల్ అఫీజ్, అబ్దుల్ రహీం, రఫిక్,షేక్ మౌళి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కొనసాగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 868వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వీడి ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చీమలాపల్లిలో ఆసరా సంబరాలు

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన మహిళలు



చీమలాపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ దేముడు

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. మూడో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అయిన సందర్భంగా 95వవార్డు పరిధి చీమలాపల్లిలో గురువారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముమ్మన దేముడు సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మహిళలతో కలిసి థాంక్యూ సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. 95 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజాబలంతో ఆయన ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో సీవో కనకరత్నం, మార్కెటింగ్ డైరెక్టర్ ఎ. ఎర్రయ్య, యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, కె.సంతోష్, నాయకులు బొట్ట గోవింద్, బొట్ట నూక అప్పలంరాదు, బొట్ట కృష్ణ, యల్లపు కృష్ణ, విరోతు విశ్వనాథం పాల్గొన్నారు.

సింహగిరిపై మొక్కల పంపిణీ



మొక్కలు తీసుకొస్తున్న ప్రధానార్చకుడు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు



మొక్కలను భక్తులకు అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: తొలి ఏకాదశి పురస్కరించుకుని గురువారం సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. గాజువాకకు చెందిన భక్తులు కాళీ కృష్ణ, కంచి శేషగిరిరావు కడియం నుంచి తీసుకొచ్చిన వెయ్యి మొక్కలు అందజేశారు. ఆ మొక్కలకు ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కల్యాణ మండపంలో పూజలు చేశారు. అనంతరం రాజగోపురం వద్ద ఉన్న కళావేదిక వద్ద దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, అధికారులు భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావేదికపై అన్నమయ్య సేవా ట్రస్ట్ నిర్వాహకురాలు సునీత ఆధ్వర్యంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేపట్టారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని సబ్బవరం రైతు భరోసా కేంద్రం వద్ద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీ వరి విత్తనాలను గురువారం ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన విత్తనాలు,ఎరువులు,పురుగుల మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారానే సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలో అన్ని రకాల విత్తనాలు రైతులకు రాయితీపై అందించేందుకు 100 టన్నుల సిద్ధంగా ఉన్నాయన్నారు. వరి విత్తనాలపై కిలోకు రూ.10 చొప్పున రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. బీపీటీ 3291(సోనామసూరి),బీపీటీ 5204 (సాంబా మసూరి),ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు),ఎంటీయూ 1064, ఎంటీయూ 1021 మొదలైన రకాలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి అప్పలనాయుడు, సబ్బవరపు బుజ్జి,మామిడి కొండాజీ,బోను గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం



నక్క నకకరాజు



జోబ్ దాస్



సబ్బవరపు ముత్యాల నాయుడు



వెన్నల సన్యాసిరావు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు జరిగినట్టు పేర్కొంది.

- సబ్బవరం మండల జేసీఎస్ ఇన్‌చార్జిగా సబ్బవరపు ముత్యాలనాయుడు నియమితులయ్యారు. అంతకాపల్లి శివారు రావలమ్మపాలేనికి చెందిన ఈయన ఎంపీపీగా పని చేశారు.
- పరవాడ మండల ఇన్‌చార్జిగా వెన్నలపాలెం పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ వెన్నల సన్యాసిరావు నియమితులయ్యారు. ఈయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు.
- పెందుర్తి మండల ఇన్‌చార్జిగా గొరపల్లికి చెందిన నక్క కనకరాజు నియమితులయ్యారు. ప్రస్తుతం పెందుర్తి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- పెందుర్తి సీ–1 పరిధిలోకి వచ్చే జీవీఎంసీ 93,94,95,96,97,98 వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జిగా లక్ష్మీపురానికి చెందిన జోబ్‌దాస్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడిగా పనిచేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు.
- పెందుర్తి సీ–2 పరిధిలోకి వచ్చే జీవీఎంసీ 77,79,85,88 వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జిగా ఇల్లపు ప్రసాద్ నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. ఈయన భార్య ఇల్లపు వరలక్ష్మి 85వ వార్డు కార్పొరేటర్‌గా పనిచేస్తున్నారు.

మోదీతోనే దేశ ప్రగతి

సింహాచలం: ఆర్థికాభివృద్ధిలో దేశాన్ని మూడో స్థానంలో నిలబెట్టిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. పెందుర్తి మండలంలోని అక్కిరెడ్డిపాలెం, జుత్తాడ, దువ్వపాలెం, దువ్వపాలెం కాలనీ, ఎస్.ఆర్.పురంలో గురువారం గొర్లెరామునాయుడు బీజేపీ శ్రేణులతో కలిసి గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తొమ్మిది ఏళ్ల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.